డ్రైపోర్ట్ ముసుగులో దగా

రామన్నపేట రైతుల నుంచి భూములు సేకరించిన అదానీ గ్రూప్

- లాజిస్టిక్స్ పార్కునూ ఏర్పాటు చేస్తామంటూ మాయమాటలు
- బిడ్డలకు ఉపాధి లభిస్తుందన్న ఆశతో భూములిచ్చిన రైతులు
- డ్రైపోర్ట్ పక్కనబెట్టి అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీకి సిద్ధమైన సంస్థ
- వేడుక చూస్తూ అదానీకి వంతపాడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- ఫ్యాక్టరీకి ధర్మారెడ్డిపల్లి కాలువ ద్వారా నీళ్లిచ్చేందుకు సన్నాహాలు
- జనావాసాల్లో సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటుతో ప్రాణాంతక రోగాలు
- గర్భస్రావం, క్యాన్సర్, ఊపిరితిత్తుల వ్యాధులు వచ్చే ప్రమాదం

తెలంగాణ సాయుధ పోరాటానికి పురిటి గడ్డ అది. ఎంతో మంది వీరులకు స్ఫూర్తినిచ్చిన నేల అది. పంట పొలాలతో నిన్నటివరకూ సిరులు కురిపించిన ఆ భూమికి ఇప్పుడు పడావుపడే దుస్థితి దాపురించింది. తొండలు కూడా గుడ్లుపెట్టనంతగా ఆ పచ్చని నేల బూడిద కాబోతున్నది. స్వచ్ఛమైన వాతావరణంతో నిన్నటివరకూ అలరారిన రామన్నపేట బుగ్గిపాలయ్యే దుస్థితి. సిమెంట్ ఫ్యాక్టరీ పేరిట అదానీ కంపెనీకి ఆ ప్రాంతాన్ని తనఖా పెట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం ఉవ్విళ్లూరడమే దీనికి కారణం..

(స్పెషల్ టాస్క్ బ్యూరో) / హైదరాబాద్, అక్టోబర్ 21 (నమస్తే తెలంగాణ): 2022-23లో మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌కు చెందిన అరిఫ్ సయ్యద్ (ఫోన్ నంబర్ 81493 64308) రామన్నపేట గ్రామానికి వచ్చాడు. అదానీ గ్రూప్ కంపెనీలో విధులు నిర్వర్తిస్తున్నట్టు నమ్మబలికాడు. రామన్నపేటలో అదానీ లాజిస్టిక్స్ పార్క్, డ్రైపోర్ట్‌ను ఏర్పాటు చేయడానికి నిర్ణయించామని, ఈ క్రమంలో భూసేకరణ చేయాల్సిందిగా కంపెనీ తనను పంపించినట్టు గ్రామంలోని కొందరిని నమ్మించాడు. చిట్యాల మండల సమీపంలో డ్రైపోర్టు ఏర్పాటుకు యోచిస్తున్నామంటూ అంతకుముందే బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రకటించడంతో ఆ డ్రైపోర్టు, లాజిస్టిక్ పార్కు ఇదేనని అంతా విశ్వసించారు. ఇదే అదునుగా భావించిన సయ్యద్ అప్పటికే తన దగ్గరున్న భూముల సర్వే నంబర్లను వారికి చూపించి.. రైతులు తనకు ఆ భూములు విక్రయించేలా చేయాలని మధ్యవర్తుల సాయం కోరాడు. లాజిస్టిక్స్ పార్కు, డ్రైపోర్టు వస్తే, గ్రామంలోని తమ బిడ్డలకు ఉపాధి అవకాశాలు వస్తాయని అంతా నమ్మారు. దీంతో రామన్నపేట, కొమ్మాయిగూడెం, సిరిపురం తదితర గ్రామాల రైతులు తమ పంటపొలాలను తక్కువ ధరకే అమ్మడానికి ఒప్పుకొన్నారు. రైతుల నుంచి భూములను డిపెండెన్షియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ పేరిట కొనుగోలు చేయించాడు సయ్యద్. 2022 సంవత్సరంలో ప్రారంభమైన ఈ భూముల కొనుగోళ్ల వ్యవహారం 2023 సంవత్సరాంతం వరకూ కొనసాగింది.

పిడుగు పడింది ఇలా..

లాజిస్టిక్స్ పార్కు, డ్రైపోర్టు పేరిట రైతుల నుంచి కొనుగోలు చేసిన దాదాపు 365 ఎకరాల భూములకు డిపెండెన్షియా కంపెనీ ప్రతినిధులు హద్దులు ఏర్పాటు చేశారు. ఆ భూముల్లోకి బయటి వ్యక్తులు రాకుండా గేటును కూడా ఏర్పాటు చేశారు. కాలం గడిచింది. తమ బిడ్డలకు ఉపాధి లభిస్తుందనుకొన్న రైతులకు నిరాశే మిగిలింది. అలా దాదాపు 8 నెలలు గడిచాయి. గత నెల 21న అకస్మాత్తుగా అదానీకి చెందిన అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీని రామన్నపేటలో ఏర్పాటు చేయబోతున్నట్టు, దీనికి సంబంధించి ప్రజాభిప్రాయ సేకరణ చేపడుతున్నట్టు పత్రికలో ప్రకటన వచ్చింది. దీంతో భూములిచ్చిన వారు ఉలిక్కిపడ్డారు.

365 ఎకరాలు కొని.. 65 ఎకరాలకే

డ్రైపోర్టు-లాజిస్టిక్ పార్క్ పేరిట వంచించి అదానీ కంపెనీ రైతుల నుంచి 365 ఎకరాల పంట భూములను సేకరించింది. వాటికి సంబంధించిన రిజిస్ట్రేషన్లు ఇతరత్రా డాక్యుమెంటేషన్‌ను కూడా పూర్తిచేసింది. సెప్టెంబర్ 21వ తేదీన ఇచ్చిన పత్రికా ప్రకటనలో మాత్రం రామన్నపేట గ్రామంలో ఏర్పాటు చేసే అంబుజా సిమెంట్ విషయమై 65 ఎకరాలకు మాత్రమే పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ చేయనున్నట్టు వెల్లడించింది.

మౌలిక సదుపాయాలకు ప్రభుత్వం ఆసక్తి

రామన్నపేట గ్రామం అభివృద్ధి గురించి పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం అదానీ ఫ్యాక్టరీ కోసం మాత్రం ఆగమేఘాలమీద మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నది. ఇందులో భాగంగా చిట్యాల నుంచి భువనగిరి వరకూ నాలుగు లేన్ల రహదారిని, పెద్దకాపర్తి నుంచి కొమ్మాయిగూడెం మీదుగా రామన్నపేట గ్రామానికి 100 అడుగుల వెడల్పుతో రహదారిని నిర్మించేందుకు ప్రతిపాదనలను సిద్ధం చేసింది.

అదానీ కోసం ధర్మారెడ్డిపల్లి కాలువ

సాగు, తాగునీటి కోసం కోట్లు వెచ్చించి నిర్మించిన ధర్మారెడ్డిపల్లి కాలువను ఇప్పుడు అదానీ ఫ్యాక్టరీ పాలు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. సిమెంట్ ఫ్యాక్టరీకి కావాల్సిన నీటిని సరఫరా చేసేందుకు వీలుగా కాలువ మొత్తాన్ని విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. 2006లో అప్పటి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో సుమారు రూ.146 కోట్లతో బునాదిగాని, పిలాయిపల్లి, ధర్మారెడ్డిరెడ్డి పల్లి కాలువ నిర్మాణ పనులను చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. తెలంగాణ ఏర్పాటు అనంతరం 2016లో కేసీఆర్ ప్రభుత్వం మొత్తంగా 3 కాలువ నిర్మాణం కోసం రూ. 284కోట్లను మంజూరు చేసింది. అందులో ధర్మారెడ్డిపల్లి కాలువ కూడా ఒకటి. మూసీలోని నీరు వలిగొండ మండలంలోని గోకారం చెరువులోకి చేరుతుంది. అక్కడి నుంచి ఆసిఫ్‌నగర్ కాలువ, ధర్మారెడ్డిపల్లి కాలువలు వేరుగా ప్రవహిస్తాయి. పోచంపల్లి మండలం ధర్మారెడ్డిపల్లి నుంచి నార్కట్‌పల్లి మండలం ఏపీ లింగోటం వరకు మొత్తంగా 51.51కి.మీ. పొడవు కాగా, ఇప్పటికే దాదాపు రూ.65 కోట్లను వెచ్చించి 45 కి.మీ. మేరకు కాల్వను పూర్తిచేశారు. కాల్వ కింద దాదాపు 17 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ఇదిలా ఉంటే ప్రస్తుతం అదానీ ఏర్పాటు చేయనున్న పరిశ్రమ నుంచే ఈ ధర్మారెడ్డిపల్లి కాలువు పారుతుండడం గమనార్హం.

ఫ్యాక్టరీ కోసమే కాలువ విస్తరణ

ఏకంగా కాలువ ప్రవాహ సామర్థ్యాన్ని సైతం అవసరానికి మించి విస్తరించేందుకు ప్రణాళికలను రూపొందించింది. ఆ మేరకు నిధులను కూడా మంజూరు చేసింది. సిమెంట్ ఫ్యాక్టరీకి రోజుకు లక్షల లీటర్ల నీరు కావాల్సి ఉంటుంది. ప్రస్తుతం కాలువ ద్వారా రోజుకు 3 లక్షల లీటర్లు మాత్రమే అందే పరిస్థితి ఉంది. వాస్తవంగా ధర్మారెడ్డిపల్లి కాలువను తొలుత 55 క్యూసెక్కుల సామర్థ్యంతో డిజైన్ చేయగా, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కాలువ ప్రవాహ సామర్థ్యాన్ని ఏకంగా 355 క్యూసెక్కులకు విస్తరించేందుకు కసరత్తును ప్రారంభించింది. ఇటీవల ఆ మేరకు ప్రతిపాదనలను సిద్ధం చేసి పంపాలని ఇరిగేషన్‌శాఖ అధికారులను ఆదేశించింది. ధర్మారెడ్డిపల్లి కాలువ పనులపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు.

సిమెంట్ ఫ్యాక్టరీతో బతికేదెలా?

తమ గ్రామంలో సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తే ఆ దుమ్ము, దూళి, కాలుష్యంతో తమకు ఎక్కడాలేని రోగాలు వస్తాయని రామన్నపేట తదితర గ్రామాల ప్రజలు భయపడుతున్నారు. జనావాసాల సమీపంలో సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటుతో భూ కాలుష్యం, జల కాలుష్యం, వాయు కాలుష్యంతో పాటు మనుషుల మనుగడకే ముప్పు వాటిల్లే ప్రమాదమున్నదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. సిమెంట్ తయారీలో భాగంగా పరిశ్రమ నుంచి విడుదలయ్యే వ్యర్థ రసాయనాలతో పలు తీవ్రమైన ఆరోగ్య సమస్యలు రావొచ్చని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. సిమెంట్ ఫ్యాక్టరీ నుంచి వెలువడే బొగ్గు, కార్బన్ మోనాక్సైడ్, సల్ఫర్ డయాక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్‌తో పాటు జిప్సం, స్లాగ్, క్లింకర్ వంటి రసాయనాలు భూమి, గాలితో పాటు నీటిని కూడా కలుషితం చేస్తాయని చెప్తున్నారు. తద్వారా ఊపిరితిత్తులు, శ్వాసకోశ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉన్నదని హెచ్చరిస్తున్నారు. చర్మ వ్యాధులు, శ్వాసనాళ, ఉదర, ఊపిరితిత్తులకు సంబంధించిన క్యాన్సర్లు, పిల్లల్లో ఎదుగుదల లోపం, కంటి చూపు, న్యుమోనియా వంటి సమస్యలతో పాటు గర్భస్రావాలు కూడా జరగొచ్చని చెప్తున్నారు.

తొండలు కూడా గుడ్లు పెట్టవు

సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటుతో బుగ్గిపాలై, మసిబారిన ఈ నేలల్లో తొండలు కూడా గుడ్లు పెట్టవని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సిమెంట్‌ను ఇతర రాష్ట్రాలకు తరలించాలంటే గ్రామాలమీదుగా పెద్దయెత్తున ట్రక్కుల రాకపోకలు సాగుతాయి. దీంతో పరిసర ప్రాంతాల రహదారులు అస్తవ్యస్తం కావడంతో పాటు దుమ్ము ధూళి లేవడంతో ఇండ్లు, మనుషులు, పశుపక్ష్యాదులు, చెట్లు, జలాశయాలు ఇలా ఒకటేమిటి గ్రామాలకు గ్రామాలే నామరూపాల్లేకుండా పోతాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నిబంధనలు తుంగలో తొక్కి!

జనావాసాలకు కనీసం 3 కిలోమీటర్ల దూరంలో సిమెంట్ ఫ్యాక్టరీలు ఉండాలని ఫ్యాక్టరీల చట్టం, 1948లో స్పష్టమైన నిబంధనలు ఉన్నాయి. అయితే, రామన్నపేటకు కేవలం 500 మీటర్ల దూరంలోనే అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేస్తున్నారు. దీంతో ఫ్యాక్టరీ ఏర్పాటులో నిబంధనలను తుంగలో తొక్కారని పర్యావరణవేత్తలు మండిపడుతున్నారు.

అంబుజా ఫ్యాక్టరీతో ప్రభావితమయ్యే గ్రామాలు

రామన్నపేట, కొమ్మాయిగూడెం, సిరిపురం, పెద్దకాపర్తి, యెల్లంకి, బోగారం, నీర్నాముల, జనంపల్లి, ఇస్కిల్ల, దుబ్బాక, తుమ్మలగూడెం(ఇంద్రపాల నగరం), సర్నేనిగూడెం, ముని పంపుల, పల్లివాడ, లక్ష్మాపురం, ఎన్నారం, శివనేనిగూడెం, కక్కిరేణి, చిట్యాల, ఉత్తటూరు.

సిమెంట్ పరిశ్రమ ఏర్పాటును అడ్డుకుంటం

- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య
- అంబుజా సిమెంట్ పరిశ్రమ ఏర్పాటుకు వ్యతిరేకంగా నిరసన

రామన్నపేట, అక్టోబర్ 21: ప్రాణాలను పణంగా పెట్టి అయినా అంబుజా సిమెంట్ పరిశ్రమను అడ్డుకుంటామని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పేర్కొన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేటలో అదానీ గ్రూప్ ఏర్పాటు చేయనున్న అంబుజా సిమెంట్ కంపెనీ గేటు ఎదుట సోమవారం రైతులు, బీఆర్ఎస్ నాయకులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా చిరుమర్తి మాట్లాడుతూ అదానీతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కుమ్మక్కై చీకటి ఒప్పందాలు కుదుర్చుకొని సిమెంట్ ఫ్యాక్టరీకి సహకరిస్తున్నారని ఆరోపించారు. స్కిల్ డెవలప్‌మెంట్‌కు వందకోట్ల ఫండ్ ఇచ్చిన అదానీ, సీఎం స్కిల్‌కు ఎన్ని వందల కోట్లు ఇచ్చారోనని అనుమానం వ్యక్తం చేశారు. నాటి కేసీఆర్ ప్రభుత్వం రైతుబంధు, సాగునీరు ఇచ్చి రైతులకు చేయూత అందిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఇబ్బంది పెడుతున్నదని మండిపడ్డారు. సిమెంట్ పరిశ్రమతో ప్రజలు వ్యాధుల బారిన పడే అవకాశం ఉన్నదని ఆందోళన వ్యక్తంచేశారు. సిమెంట్ పరిశ్రమ ఏర్పాటును మానుకోకపోతే కోర్టును ఆశ్రయిస్తామని హెచ్చరించారు. 23న జరిగే ప్రజాభిప్రాయ సేకరణను ప్రజలు ముక్త కంఠంతో వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి మల్లేశం, మాజీ ఎంపీపీ దయాకర్, కంభంపాటి శ్రీనివాస్, మాధవరెడ్డి, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, రైతులు పాల్గొన్నారు.

ఓర్నీ..ఇది పిల్లకాలువే!

మొదటిపేజీ తరువాయి...

అవుతున్న వీడియోలను బట్టి తెలుస్తున్నది. 'ఇది నది కాదు. పిల్ల వాగు' అని బృందంలోని ఒకరు, 'దీన్ని చూడటానికి ఇంత దూరం వచ్చామా?' అని మరో సభ్యుడు గుసగుసలాడుకొన్నట్టు సమాచారం. 'ఈ వాగుకు సుందరీకరణ కూడా అవసరంలేదు' అని బృందంలోని మరో సభ్యుడు వాపోవడం వీడియోలో కనిపిస్తున్నది.

రియల్ ఎస్టేట్‌పైనే చర్చ

చుంగ్ గై చున్ వాగు పరిసరాల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కూడిన బృందం పర్యటిస్తున్న సమయంలో సభ్యుల మధ్య వాగు నీటి శుద్ధికి సంబంధించిన ఏ ఒక్క చర్చ కూడా జరుగలేదని తెలుస్తున్నది. పైగా వాగు చుట్టుపక్కల నిర్మించిన భారీ భవనాలు, రియల్ ఎస్టేట్‌పై బృంద సభ్యుల మధ్య పెద్దఎత్తున చర్చ జరిగినట్టు వీడియోలను బట్టి అర్థమవుతున్నది. దీంతో మూసీ పునరుజ్జీవం కోసం సియోల్ పర్యటన చేపట్టినట్టు కనిపించట్లేదని, మూసీ పరీవాహకంలో రియల్‌ఎస్టేట్‌ను ప్రోత్సహించడానికి కావాల్సిన స్ఫూర్తి పొందడానికే ఈ టూర్‌ను చేస్తున్నట్టు కనిపిస్తున్నదని తెలంగాణవాదులు మండిపడుతున్నారు. రూ. కోట్ల ప్రజాధనాన్ని ఇలాంటి పర్యటనల పేరిట ఖర్చు చేయడం ఏమిటని? రేవంత్ ప్రభుత్వాన్ని నెటిజన్లు నిలదీస్తున్నారు.

టూర్‌పై నెటిజన్ల ట్రోలింగ్

కాంగ్రెస్ మంత్రుల సియోల్ పర్యటనపై నెటిజన్లు తమదైన శైలిలో వ్యంగ్యాస్త్రాలు సంధించారు. 'నిజంగా ఇది అధికారిక పర్యటన అయితే, కొరియా ప్రతినిధులు ఎక్కడ?' అని సీతారామ్ అనే ఓ నెటిజన్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ పర్యటన మూసీ బ్యూటిఫికేషన్ కోసం చేస్తున్నట్టు కనిపించట్లేదని, లూటిఫికేషన్ ఎజెండాగా ఈ టూర్ సాగుతున్నట్టు కనిపిస్తున్నదని సామ్యూల్ జాన్సన్ అనే మరో నెటిజన్ మండిపడ్డారు. 'ఈపాటి పిల్ల కాలువను చూడడానికి సియోల్ వెళ్లడం ఎందుకు?' అని రఘునందన్ అనే మరో నెటిజన్ ఎద్దేవా చేశారు. 'వాగు పక్కనే ఉన్న బిల్డింగ్‌లు కూడా బఫర్ జోన్‌లో ఉన్నాయని మన రేవంత్ సర్కారు కూల్చేస్తుందేమో?' అని ఆదిత్య అనే ఇంకో నెటిజన్ చమత్కరించారు. మొత్తానికి కాంగ్రెస్ మంత్రుల సియోల్ యాత్ర ఓ అట్టర్‌ఫ్లాప్‌గా మారిందన్న విమర్శలు నెట్టింట చక్కర్లు కొట్టాయి.

కొరియా ప్రతినిధులెక్కడ?

ప్రభుత్వం తరుపున ఓ బృందం విదేశీ పర్యటన చేసినప్పుడు ఆ దేశ ప్రభుత్వాధికారులు లేదా ప్రతినిధులు దగ్గరుండి పర్యటన చేయిస్తారు. పర్యటన మొదలు పూర్తయ్యే వరకూ బృంద సభ్యులతో ఉంటూ తమ దేశంలోని ప్రాజెక్టులను సమగ్రంగా వివరిస్తారు. చుంగ్ గై చున్ వాగును పరిశీలిస్తున్న సమయంలో తెలంగాణ నుంచి వెళ్లిన బృందం మినహా అక్కడ సియోల్ ప్రభుత్వ ప్రతినిధులెవ్వరూ హాజరుకాలేదని తెలిసింది.

ప్రతిపక్ష నేతల కాలేజీలనే సీట్లను పెంచలేదా?

- హైకోర్టు ఆదేశాలను ఎందుకు అమలు చేయలేదు?
- ప్రభుత్వానిది కచ్చితంగా కోర్టు ధిక్కరణే అవుతుంది
- ఇంజినీరింగ్ సీట్ల పెంపులో ప్రభుత్వం తీరుపై హైకోర్టు
- రాష్ట్ర ప్రభుత్వ అధికారులకు ధిక్కారణ నోటీసులు జారీ
- ఏ మేరకు శిక్ష విధించాలో తేల్చుతామని వెల్లడి
- ఏఐసీటీఈ, జేఎన్‌టీయూ ఆమోదించిన కోర్సుల్లో సీట్ల భర్తీకి అనుమతి

హైదరాబాద్, అక్టోబర్ 21(నమస్తే తెలంగాణ): ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీల్లో ఏఐసీటీఈ, జేఎన్టీయూ ఆమోదించిన సీట్ల పెంపునకు ప్రభుత్వం అనుమతించాలన్న గత ఉత్తర్వులను అమలు చేయని రాష్ట్ర ప్రభుత్వ తీరుపై హైకోర్టు నిప్పులు చెరిగింది. సీట్ల భర్తీకి మాప్ -అప్ కౌన్సెలింగ్ నిర్వహించాలని సెప్టెంబర్ 9న ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయకపోవడం.. ఉద్దేశపూర్వకంగా కోర్టు ధిక్కారానికి పాల్పడినట్టుగా అనిపిస్తున్నదని వ్యాఖ్యానించింది. కోర్టు ఉత్తర్వులను అమలు చేసే ఉద్దేశం ప్రభుత్వానికి లేనట్టున్నదని మండిపడింది. హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులపై దాఖలు చేసిన అప్పీలును సుప్రీంకోర్టు కొట్టివేసిన తర్వాత కూడా ఎందుకు అమలు చేయలేని నిలదీసింది. సీట్లు పెంపుదల చేయాల్సిన కాలేజీలు మరో రాజకీయ పార్టీకి చెందినవి కావడం వల్లే పెంపుదల చేయలేదా? అంటూ సందేహం వ్యక్తంచేసింది. ప్రత్యర్థి పార్టీకి చెందిన కాలేజీలు అయినందున పెరిగిన సీట్లకు అనుమతించడం లేదన్నట్టు అనిపిస్తున్నదని వ్యాఖ్యానించింది. సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం ఈ నెల 23వ తేదీతో సీట్ల భర్తీ ప్రక్రియ ముగిసిపోనుందని గుర్తుచేసింది. ఆ తర్వాత కాలేజీలకు అనుకూలంగా ఉత్తర్వులు జారీచేస్తే ఏం ఉపయోగం అని ప్రశ్నించింది. ఏఐసీటీఈ అనుమతించిన సీట్లను భర్తీ చేసుకోవడానికి కాలేజీలకు అనుమతిస్తున్నట్టు ప్రకటించింది. అయితే, ప్రైవేటు కాలేజీలు ఎలాంటి క్యాపిటేషన్ ఫీజు వసూలు చేయరాదని షరతు విధించింది. కోర్టు ఉత్తర్వులను ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించినట్టు కనిపిస్తున్నందున ప్రభుత్వంపై కోర్టు ధిక్కరణ కింద ఎందుకు శిక్ష విధించరాదో వివరణ ఇవ్వాలని ఆదేశించింది. ఉన్నత విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ ఏ శ్రీదేవసేన, ఉన్నత విద్యా శాఖ కన్వీనర్ శ్రీరాంవెంకటేశ్, టీజీఈ ఏపీసెట్ కన్వీనర్ డాక్టర్ బీ డీన్‌కుమార్‌కు కోర్టుధిక్కార నోటీసులు జారీచేసింది.

ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీల్లో ఏఐసీటీఈ, జేఎన్‌టీయూలు ఆమోదించిన మేరకు సైబర్ సెక్యూరిటీస్ వంటి కంప్యూటర్‌సైన్స్, ఇతర కోర్సుల్లో సీట్ల పెంపునకు అనుమతివ్వాలని, మాప్‌అప్ కౌన్సెలింగ్ నిర్వహించి సీట్లను భర్తీ చేయాలని గత నెల 9న ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయకపోవడంపై ఎంజీఆర్, సీఎంఆర్ ఇంజినీరింగ్ కాలేజీ, చంద్రమ్మ ఎడ్యుకేషనల్ సొసైటీ, మల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజీ, కేఎంఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ, ఎంఎల్ఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, విద్యాజ్యోతి ఎడ్యుకేషనల్ సొసైటీ తదితర కాలేజీలు కోర్టు ధిక్కరణ పిటిషన్లు దాఖలుచేశాయి. వాటిపై ధర్మాసనం సోమవారం విచారణ జరిపింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావుతో కూడిన ధర్మాసనం ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది ఎస్ రాహుల్‌రెడ్డి చేసిన వాదనలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేసింది. ప్రభుత్వ వాదనలపై కౌంటర్ వేసేందుకు సమయం కావాలని రాహుల్‌రెడ్డి కోరడాన్ని తీవ్రంగా ఆక్షేపించింది. సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్ దాఖలు చేసినట్టు రాహుల్‌రెడ్డి చెప్పగా, అక్కడేమీ మధ్యంతర ఉత్తర్వులు రాలేదు కదా అని నిలదీసింది.

పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాదులు దేశాయ్ ప్రకాశ్‌రెడ్డి, ఎస్ నిరంజన్‌రెడ్డి వాదిస్తూ, కోర్టు ధిక్కరణ చట్టం కింద్ర 6 నెలల జైలు శిక్ష, జరిమానా విధించే విధంగా అధికారుల చర్యలు ఉన్నాయని చెప్పారు. దీనిపై స్పందించిన హైకోర్టు, ఏవిధంగా కోర్టు ఉత్తర్వుల అమలు నిలిపివేతను సమర్థించుకుంటారని ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. అక్టోబర్ ఒకటిన రివ్యూ పిటిషన్ దాఖలు చేసి కోర్టు ఉత్తర్వులను అమలు చేయకుండా తప్పించుకునేందుకు ప్రయత్నం చేయవద్దని తేల్చిచెప్పింది. ఒక తప్పు జరిగినపుడు దాన్ని సరిచేసుకునే ప్రయత్నం చేయలేదని, తాము ఆ తప్పును కొనసాగించలేమని వెల్లడించింది. తిరిగి ప్రభుత్వ న్యాయవాది రాహుల్‌రెడ్డి కల్పించుకుని ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించలేదని, కౌన్సెలింగ్ పూర్తయిందని, లక్ష మంది పైగా విద్యార్థుల అడ్మిషన్లు జరిగిన కారణంగా సీట్ల పెంపు ఉత్తర్వులను అమలు చేయలేకపోయారని వివరించారు. ఈ సమయంలో మాప్ అప్ కౌన్సెలింగ్ చేయడం కష్టసాధ్యమని అన్నారు. హైకోర్టు ఆగ్రహం నేపథ్యంలో విచారణ మధ్యాహ్నానికి వాయిదా పడింది. ప్రభుత్వం తరపున అడ్వకేట్ జనరల్ ఏ సుదర్శన్‌రెడ్డి వాదిస్తూ, సుప్రీంకోర్టు ఉత్తర్వులను తిరిగి సమీక్షించాలని ప్రభుత్వం రివ్యూ పిటిషన్ దాఖలు చేసిందని చెప్పారు. తాము ఆ ఉత్తర్వుల వివరాల్లోకి వెళ్లడం లేదని, కోర్టుధిక్కార పిటిషన్ వరకే పరిమితమై విచారణ చేస్తున్నామని ధర్మాసనం స్పష్టంచేసింది. సీట్ల పెంపునకు సుప్రీంకోర్టు ఇచ్చిన గడువు ఈ నెల 23వ తేదీతో ముగిసిపోతున్నందున, ఆ సీట్ల పెంపునకు పిటిషనర్ కాలేజీలకు అనుమతిస్తున్నట్టు ఉత్తర్వులు జారీచేసింది. చట్ట ప్రకారం కోర్టుధిక్కరణకు పాల్పడిన అధికారులపై ఏమేరకు శిక్ష విధించాలో తేల్చుతామని వెల్లడించింది. తదుపరి విచారణను వాయిదా వేసింది.

ఆదాయం పెరగలే.. జీఎస్టీ ఎదగలే!

మొదటిపేజీ తరువాయి...

పెరిగాయి. అంటే రూ.1311 కోట్ల పెరుగుదల నమోదయ్యింది. ఈ ఏడాది రూ.5,267 కోట్ల ఆదాయం వచ్చింది. పెరుగుదల కేవలం రూ.41 కోట్లు మాత్రమే. వీటిని కేవలం గణాంకాలుగా చూడొద్దని, రాష్ట్ర ప్రభుత్వ పని తీరును ప్రతిబింబించే లెక్కలుగా చూడాలని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఆరు నెలలుగా ఆదాయ వృద్ధి తిరోగమనంలో ఉండటం మంచి సూచిక కాదని, ఇది ప్రభుత్వం పాలనా సమర్థతపై అనుమానాలు కలిగిస్తుందని పేర్కొంటున్నారు.

ఆరు నెలలుగా ఇదే పరిస్థితి..

జీఎస్టీ వసూళ్ల వృద్ధి తిరోగమనం సెప్టెంబర్‌కే పరిమితం కాలేదు. ఈ ఆర్థిక సంవత్సరం మొదలైనప్పటి నుంచీ ఇదే పరిస్థితి. గతేడాదితో పోల్చితే గత ఆరు నెలల్లో జీఎస్టీ వసూళ్ల వృద్ధిలో గణనీయమైన వ్యత్యాసం కనిపించింది. నిరుడు ఏప్రిల్ వసూళ్లలో 13 శాతం వృద్ధి నమోదు కాగా, ఈ ఏడాది 11 శాతానికే పరిమితం అయ్యింది. మే నెలలలోనూ ఇవే గణాంకాలు నమోదయ్యాయి. ఇక జూన్‌లో గతేడాది 20 శాతం వృద్ధి ఉంటే.. ఈ ఏడాది కేవలం 0.74 శాతమే వృద్ధి కనిపించింది. గత ఆరునెలల్లో ఇదే తక్కువ వృద్ధి. ఇక జూలైలో గతేడాది 7 శాతం వృద్ధి నమోదుకాగా.. ఈ ఏడాది 2 శాతానికి మించలేదు. ఆగస్టులోనూ గతేడాది 13 శాతం వృద్ధితో జోరు చూపించగా, ఈ ఏడాది 4 శాతంతో మందగించింది. సెప్టెంబర్ సంగతి సరేసరి.. ఈ ఏడాది రెండో అతి తక్కువ వృద్ధి రేటు నమోదైంది.

అన్ని రంగాల్లో స్తబ్ధత

ఆర్థిక కోణంలో చూస్తే జీఎస్టీ వసూళ్లు వృద్ధి చెందాయంటే రాష్ట్రంలోని అన్ని రంగాల్లో వృద్ధి నమోదవుతున్నదని అర్థం. కొనుగోళ్లు, అమ్మకాలు, పారిశ్రామిక ఉత్పత్తులు, పెట్టుబడుల రాక వంటివన్నీ సవ్యంగా సాగుతున్నట్టని ఆర్థిక నిపుణులు చెప్తున్నారు. అలా జరగకుండా ఆర్థిక వృద్ధి మందగించినా, తిరోగమనం దిశగా సాగుతున్నా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో స్తబ్ధత నెలకొంటున్నదన్న సంకేతాలు వచ్చినట్టేనని స్పష్టం చేస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో పారిశ్రామిక రంగం మందగించిందని, కంపెనీలు పెట్టుబడులు ప్రకటిస్తున్నా అమల్లోకి రావడం లేదని, వ్యవసాయ రంగంలో గందరగోళం నెలకొన్నదని, రియల్ ఎస్టేట్ రంగం చతికిలపడిందనే ఆందోళన కనిపిస్తున్నదని, ఇవన్నీ కలగలిపి జీఎస్టీ వసూళ్ల వృద్ధిపై ప్రభావం చూపిస్తున్నాయని విశ్లేషిస్తున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా కండ్లు తెరవాలని సూచిస్తున్నారు. లేదంటే వసూళ్లు మరింత పడిపోతాయని, మైనస్‌లలోకి వెళ్లినా ఆశ్చర్యం లేదని హెచ్చరిస్తున్నారు.

గతేడాదితో పోల్చితే వసూళ్ల పరిస్థితి ఇలా.. (రూ.కోట్లలో)

నెల	2022లో	2023	వృద్ధిరేటు	2024	వృద్ధిరేటు
ఏప్రిల్	4,955	5,622	13%	6,236	11%
మే	3,982	4,507	13%	4,986	11%
జూన్	3,901	4,681	20%	4,716	0.74%
జూలై	4,547	4,849	7 %	4,940	2%
ఆగస్టు	3,871	4,393	13%	4,569